"సుశీలా, మాతండ్రిగారికి నాయందఖండప్రేమ కలదు. నేను పలుకునదంతయు నా మేలుకొఱకే, యథాయోగ్యమైనవియే, అని వారివిశ్వాసము. అదియుఁగాక, సద్గుణము లున్నచోట వారును మెచ్చుచుందురు. కావున నీవు నన్నుఁ బూర్ణముగా నమ్ముము. కన్నీరుఁ గార్పకుము. తుడిచికొనుము. నీకన్నులలోఁ గారుచున్న యశ్రుబిందువులు నాహృదయమును జలింపఁజేయుచున్నవి. ఎన్నఁటికిని నిన్నుఁ బాయను. నాపలుకులు నమ్ముము."

ఈయూరడింపుపలుకులను వినినంత సుశీల యతనిఁ గంఠాలింగన మొనర్చుకొనెను. కాని, యశ్రుజలమోచనముమాత్రము బంధము కాలేదు. మధుకరుఁ డనేకవిధముల నామె నూరడించెను. కాని "ననుఁ బోలిన దౌర్భాగ్యను వరించుటవలన మీతండ్రికి నీపైఁగోప ముదయించును. నాయందలి యనురాగమువలన నీప్రత్యక్షజన్మదాతతో నీకు వైరము పొసఁగుటయుఁ దటస్థించును. ఏలన, నేను నిరాశ్రయను, నిరాధారను; కావున, నావిన్నప మాలింపుము; మధుకరా, నాన్నగారియిచ్ఛకు వ్యతిరేకముగఁ బ్రవర్తింపకుము. వారియాజ్ఞలను బాలింపుము. నన్నుఁ బెండ్లియాడునుద్దేశము మానుము. కాని, కాని,మధూ, నాయందలి-ప్రేమ-మాత్రము-తగ్గింపకుము. ఇదియే- ఇంతయే- నావిన్నపము. నీవే నాపతివి; నీవే నాహృదయేశ్వరుడవు; నీవే నాజీవితసర్వస్వమవు. ఇది నేనెన్నఁటికిని-ఏసమయమునను- మరువను. నాన్నగారిని సంతుష్టిపఱుచుటకై, ముందెప్పుడో యొకసమయమున, నీమనసు మార్చుకొనుటకన్న—నీతండ్రిగారి యాలోచనలవలన నెప్పుడో నీమతి చలించుటకన్న- ఇప్పుడే నీహృదయము మారిపోయిన—నాయందలి ప్రేమను మరచిపోయిన—మేలుకాదా?" అని సుశీల యశ్రువిమోచనము సేయుచునె గద్గదస్వరమునఁ బలికెను.

మధుకరుఁ డాబాలికామస్తకముఁ దన వక్షస్థలమున కదిమిపట్టికొని యుండెను. అశ్రుజలపూర్ణములగు నామె నేత్రములను జేలాంచలమునఁ దుడుచుచుండెను. కాని, తనమూలమున నొరునకు సంకటము లొదవునేమో యను తలంపామెకుఁ దీవ్రవేదన యొసఁగుచుండ నామె దుస్సహదుఃఖమున మునిఁగియుండెను? అవును; తన మూలమున దనప్రియతమునకు—తనసర్వసర్వస్వమునకు—దుఃఖమొదవుట కేప్రియురాలిచ్చగింపఁగలదు? తన సుఖసంపదలను—ప్రాణముల నుసైతము—అతనికొఱకు సమర్పింపఁదెగించుట కేకాంత వెనుదీయఁగలదు? సుశీలయు నట్టిదె. దుర్భరదుఃఖావేగమున నామె కన్నులనుండి బాష్పవారి ప్రవహించుచుండెను. మధుకరుని వక్షోభాగమంతయుఁ దడిసిపోయెను. అతఁ డనేకవిధముల నామెను సాంత్వనవాక్యములచే నూఱడింపఁ బ్రయత్నించుచుండెను. అయినను నశ్రువిమోచనము బంధము కాలేదు. కావున నె యతఁడు ప్రారంభమున నుడివినవాక్యము నుచ్చరించెను. ఆమెకు నమ్మిక కలిగించుటకై "సుశీలా, నే నేయొట్టుఁబెట్టిన నీవు నమ్ముదువో, చెప్పు" మని యడిగెను. అందున కా బాలిక బాల్యోచితానుభవమునఁ దనకుఁ దోఁచిన రీతిఁ బ్రత్యుత్తర మొసంగెను. ఇంతలో 'మధుకరా, మధుకరా' యని తన్నెవ్వరో పిలుచుచుంట యాతనికి వినవచ్చెను. ఈపిలు పేవైపునుండి వచ్చినదో యని యటు నిటుఁ జూచుచుండ నంతలో శ్యామరా వచటికి వచ్చి చేరెను. అంత సుశీలా మధుకరుల కొదవినయవస్థ యిట్టిదని చెప్పనలవికాదు. వారి బాహుబంధములు సడలెను. మధుకరుఁడు లజ్జావనతవదనుఁ డయ్యెను. సుశీల నేత్రాంచలమందలి బాష్పములను దుడిచివైచెను. ఆమె సర్వాంగములను జెమ్మటలూరెను. దేహయంతయు గడగడ వడఁకఁ దొడఁగెను. అప్పుడే చీఁకటి నలువంకలను గ్రమ్ముచుండుటచే, వీరి యాయవస్థయంతయును, వెలవెలఁ బాఱినవారముఖమండలములును,శ్యామరావునకుఁ గనఁబడలేదు. అయినను సుశీలాభీతస్థితి యతని కెఱుకపడకపోలేదు. ఎవ్వరు నేమియుఁ బలుకకుంటఁ గని శ్యామరా విట్లనెను. "మధుకరా, రేపేకదా నీవు కలకత్తాకుఁ బోవుట. ప్రయాణసన్నాహములకుఁ దొడరక యిచటికివచ్చి కూరుచుంటివేమి? సుశీలను దర్శించి మాట్లాడ నెంచియుండిన నింటనె మాట్లాడియుండవచ్చును. పో, పొమ్ము, సర్వము సిద్ధపఱుపఁబొమ్ము."

మధుకరుఁ డెప్పు డిక్కడనుండఁ బాఱిపోవుట కనువగునా యనియే యాలోచించుచుండెను. సుశీలతోఁ బ్రేమాలాప మొనర్చుచున్నందున నాన్నగారి కాగ్రహ మొదవునేమో యని యతఁడు దిగులుపడి యుండెను.

